అద్దె భవనాల్లో అంగన్‌వాడీలు

- గజపతినగరం మండలంలో 61 అంగన్‌వాడీ కేంద్రాలు
- 30 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు
- అద్దె భవనాల్లో అరకొర వసతులతో ఇబ్బందులు


పురిటిపెంట గ్రామంలో అద్దె ఇంటిలో నడుస్తున్న అంగన్‌వాడీ కేంద్రం-1

గజపతినగరం: మండలంలో పలుగ్రామాల అంగన్‌వాడీ, మినీ అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో సిబ్బంది, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు అవస్థలు పడుతున్నారు. గజపతినగరం ఐసీడీఎస్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను గజపతిన గరం, ఎస్.లింగాలవలస, మరుపల్లి సెక్టార్లుగా విభజించారు. ఈ మూడు సెక్టార్ల పరిధిలో మొత్తం 61 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 30 కేంద్రాలకు మాత్రమే సొంత భవనాలు ఉన్నాయి. 23 కేంద్రాలు అద్దెభవనాల్లో, 8 రెంట్ ఫ్రీ భవనా ల్లో నడుస్తున్నాయి. అద్దె భవనాలు ఇరుకుగా ఉండడం, సదుపాయాలు లేకపోవడంతో కేంద్రాల్లోని సిబ్బందితో పాటు చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య అందించడంతో పాటు వారికి భోజనం అందించాల్సి ఉంటుంది. అయితే చాలా అద్దె భవనాల్లో గ దులు ఇరుకుగా ఉండడంతో చిన్నారులతో ఆటలు ఆడించాలన్నా, వారికి చదువు చెప్పాలన్నా సిబ్బందికి ఇబ్బందిగా మారుతోం ది. కొన్నిచోట్ల మరుగుదొడ్ల సదుపాయం కూడా లేదు. ప్రైవేటు భవనాలు కావడంతో ఆయా కేంద్రాల్లో ప్రభుత్వ నిధులతో వసతులు మెరుగుపరిచేందుకు అధికారులు వెనుకాడుతున్నారు. గజపతినగరం సెక్టార్‌లో బూడి పేట,ఎం.వెంకటాపురం-1, 2, పురిటిపెంట-1, పురిటిపెంట రైల్వేస్టేషన్, గంగచోళ్లపెంట-1,2, పట్రువాడ,ఎన్.జి.ఆర్.పురం కేంద్రాలు, ఎస్.ఎల్.వలస, మరుపల్లి సెక్టా ర్లలోని పలుగ్రామాల్లో కేంద్రాలను అద్దె ఇళ్లలో నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే అరకొర అద్దె కూడా సకాలంలో ఇవ్వకపోవడం వల్ల కేంద్రాలను ఖాళీ చేయాలని ఇంటి యజమానుల నుంచి పదేపదే ఒత్తిడి వస్తోందని, తమ జీతాల నుంచి అద్దెలు చెల్లించుకోవాల్సి వస్తోందని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంగన్ వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని, ప్రస్తుతం ప్రభుత్వ భవనాల్లో నడుస్తున్న కేంద్రాల్లో సదుపాయాలు మెరుగు పరచాలని పిల్లల తల్లి దండ్రులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


ఎం.వెంకటాపురంలో ఇరుకుగదిలో నిర్వహిస్తున్న అంగన్‌వాడి కేంద్రం-2


ఎం, వెంకటాపురంలో అద్దె భవనంలో అంగన్‌వాడి కేంద్రం-1

నివేదికలు పంపించాం

అద్దె భవనాల్లో నడుస్తున్న కేంద్రాలపై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. అలాగే అర్ధంతరంగా నిలిచిన ఎం.వెంకటాపురంతో పాటు పలు గ్రామాల్లో భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించాలని ఉన్నతాధికారులను కోరాం.

– పి.నాగమణి, ఐసీడీఎస్ పీఓ

పక్కాగా పారిశుద్ధ్య పనుల నిర్వహణ


కొత్తవలస: ఉత్తరాపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న డీపీఓ వెంకటేశ్వరరావు

కొత్తవలస/గంట్యాడ: గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణ పక్కాగా చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) వెంకటేశ్వరరావు పంచాయతీ, వైద్య సిబ్బంది, అధికారులకు సూచించారు. కొత్తవలస మండలంలోని ఉత్తరాపల్లి గ్రామంలో, గంట్యాడ మండలంలోని రామవరం గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై శనివారం చేపట్టిన సర్వేతో పాటు పారి శుద్ధ్య పనులను పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి వ్యక్తిగత మరుగుదొడ్డి ఉందా, లేదా?, మరుగుదొడ్డి ఉంటే నీరు బయటకు పోయే మార్గం, ఆ ఇంటికి తాగునీరు అందించే మార్గం, చెత్తసేకరణ తదితర అంశాలపై ఈనెల 13వ తేదీ వరకు గ్రామాల్లో సర్వే చేయనున్నట్లు తెలిపారు. సర్వే కోసం ఏఎన్ఎం, గ్రామైక్య మహిళా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులతో కమిటీ వేశామని చెప్పారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేయించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. మురుగునీటి కాలువల్లో నుంచి తీసిన పూడికతో పాటు బహిరంగ ప్రదేశాల్లో పేరుకుపోయిన చెత్తను గ్రామానికి దూరంగా తరలించాల ని, కాలువల్లో తప్పనిసరిగా బ్లీచింగ్ పౌడర్ వేయాలని చెప్పారు.దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, రక్షిత మంచినీటి వనరుల చుట్టూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈఓపీఆర్డీలు శ్రీదేవి, భానోజిరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సింహాచలం ఆశయాలు అనుసరణీయం


సింహాచలం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న మాజీ ఎంపీ చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: న్యాయవాది, చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్‌గా సేవలందించిన బెల్లాన సింహాచలం ఆశయాలు అనుసరణీయమని పలువురు వక్తలు అన్నారు. మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తండ్రి సింహాచ లం 21వ వర్ధంతిని పట్టణంలో మాజీ ఎంపీ బెల్లాన నివాసంలో శనివారం నిర్వహించారు. సింహాచలం చిత్రపటానికి కుటుంబ సభ్యులతో పాటు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా నార్కోటిక్స్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బెల్లాన రవి, మేజర్ పంచాయతీ ఉపసర్పంచ్ బెల్లాన శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, ఇప్పిలి గోవింద, పతివాడ రాజారావు, గవిడి సురేష్, అప్పికొండ ఆదిబాబు, ముల్లు పైడిరాజు, కొసిరెడ్డి రమణ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల సందర్శన

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను ఎంఈఓ-2 బాలభాస్కరరావు శనివారం సందర్శించారు.విద్యార్థినులు, ఉపాధ్యాయ సిబ్బంది హాజరు, పీఎం పోషణ తదితర రికార్డులను, తరగతి గదులు, వంటశాల, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పబ్లిక్‌పరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో పదోతరగతి విద్యార్థినులకు వివరించారు. చదువులో వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని ఉపాధ్యాయినులకు సూచించారు. విద్యార్థినుల అపార్ నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు.


పదోతరగతి విద్యార్థినులకు సూచనలు చేస్తున్న ఎంఈఓ-2 బాలభాస్కరరావు

ప్రజారోగ్య పర్యవేక్షణపై శిక్షణ

లక్కవరపుకోట/కొత్తవలస: గ్రామాల్లో ప్రజల ఆరోగ్య పరిస్థితులపై వైద్య సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఎల్.కోట, వియ్యం పేట పీహెచ్‌సీల వైద్యాధికారులు బి.అనిల్‌కుమార్, గోపాలకృష్ణ సూచించారు. ఎల్.కోట, కొత్తవలస మండలంలోని వియ్యంపేట పీహె చ్‌సీల్లో ఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు శనివారం శిక్షణ ఇచ్చారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి వనరుల శుభ్రత, క్లోరినేషన్, మురుగునీటి కాలువల్లో ఉన్న తాగునీటి పైపులైన్ల గుర్తింపు, ఫీవర్ సర్వే, వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగంపై, డయేరియా, క్యాన్సర్‌పై అవగాహన కల్పించడం, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఇతర శాఖల అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ గ్రామాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.


వియ్యంపేట పీహెచ్‌సీలో శిక్షణ ఇస్తున్న వైద్యాధికారి గోపాలకృష్ణ


ఎల్.కోట పీహెచ్‌సీలో వైద్యారోగ్య శాఖ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న వైద్యాధికారి అనిల్‌కుమార్

మాజీ సర్పంచ్ తాడుకు నివాళి


తాడు మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అప్పలనరసయ్య

దత్తిరాజేరు: మండంలోని పి.లింగాలవలస మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కొత్తల తాడు(45) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న గజ పతినగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య శనివారం పి.లింగాలవలసలోని తాడు నివాసానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మృతుడి భార్య, సర్పంచ్ మంగమ్మను, కుటుంబ సభ్యులను ఓదార్చారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున, ఏఎంసీ మాజీ చైర్మన్ ముత్యాలనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు మంత్రి అప్పలనాయుడు, కడుబండి రమేష్‌నాయుడు, సుమల శ్రీను, మండల శ్రీను వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

శానిటేషన్ డ్రైవ్


చినచామలాపల్లిలో చేతి పంపు వద్ద పిచ్చిమొక్కలు తొలగిస్తున్న కార్మికులు

దత్తిరాజేరు: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో శనివారం శానిటేషన్ డ్రైవ్ నిర్వహించామని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య కార్మికులతో వీధికాలువల్లో పూడిక, చెత్తను తీయించారని చెప్పారు. వ్యాధులు ప్రబల కుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

ఎలక్ట్రికల్ రిక్షాలు మంజూరు చేయండి


కలెక్టర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మారుతీ వికలాంగుల సంఘ సభ్యులు

భోగాపురం: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న అండర్-14 రాష్ట్ర స్థాయి పోటీలను ప్రారంభించడానికి శనివారం విచ్చేసిన కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను మండల మారుతి వికలాంగుల సంఘ అధ్యక్షుడు రామిశెట్టి చిన్నారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని ఇద్దరు దివ్యాంగులకు త్రీవీలర్ ఎలక్ట్రికల్ రిక్షాలు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. కారిగొల్లపేట, భోగాపురం గ్రామాలకు చెందిన బమ్మిడి పాపారావు, నరేడ్ల కామేశ్వరరావులకు ట్రైసైకిళ్లు లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనికి కలెక్టర్ అంబేడ్కర్ స్పందిస్తూ ట్రైసైకిళ్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న స్వామి వారు

జామి: భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం, స్వామి వారి జన్మనక్షత్రం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు.ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో స్వామివారిని తులసీదళాలు, వివిధ పుష్పాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

ఎం.కొత్తవలసలో వైద్యశిబిరం


శిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ పుష్పాంజలి, సిబ్బంది

గజపతినగరం: మండలంలోని ఎం.కొత్తవలస గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పుష్పాంజలి ఆధ్వర్యంలో శనివారం 104 వైద్యశిబిరం నిర్వహించారు. 59 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వ్యాధుల బారిన పడకుండా పాటించాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలతో కలిసి గృహసందర్శన చేసి గర్భిణులు, వృద్ధులకు వైద్య తనిఖీలు చేశారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు


స్కూటీ డ్రైవ్ చేస్తూ పట్టుబడిన బాలుడికి కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ నవీన్‌పడాల్

లక్కవరపుకోట: మైనర్లకు ద్విచక్ర, ఇతర వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానులపై కేసులు నమో దు చేస్తామని ఎస్ఐ నవీన్ పడాల్ హెచ్చరించారు. మండ లంలోని సోంపురం జంక్షన్ సమీపంలో శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. ట్రిపుల్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసేవారిపై, వాహనాలు నడుపుతున్న మైనర్లపై దృష్టి సారించినట్లు ఆయన తెలిపారు. ట్రిపుల్ డ్రైవింగ్ చేస్తున్న ఆరుగురు వాహన చోదకులపై, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవ్ చేస్తున్న ఇద్దరిపై కేసులు నమోదు చేశామని చెప్పారు. అలాగే స్కూటీ నడుపు తున్న ఒక బాలుడికి కౌన్సిలింగ్ ఇచ్చి, ఆ బాలుడి తల్లిదండ్రులపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

హైరిస్క్ గర్భిణులు జాగ్రత్తలు పాటించాలి


గర్భిణికి వైద్య తనిఖీలు చేస్తున్న డాక్టర్ ధరణి

వేపాడ: ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ధరణి, గైనకాలజిస్ట్ ఎస్.ఫణిశ్రీ 39 మంది గర్భిణులకు శనివారం వైద్య పరీక్షలు చేశారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి, వారు పాటించాల్సిన జాగ్రత్తలను సూచించారు. క్రమం తప్పకుండా తనిఖీలు చేయించు కోవాలని, విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని చెప్పారు. బానాది సత్యసాయి భక్తి మండలి సభ్యులు సమకూర్చిన భోజనాలను డాక్టర్ ధరణి గర్భిణులకు వడ్డించారు. సీహెచ్ఓ ఆంజనేయులు, పాల్గొన్నారు.

హైవేపై వేగ నిరోధకాల ఏర్పాటు


అంబటివలస వద్ద స్టాపర్లను ఏర్పాటు చేస్తున్న పోలీసులు

బొండపల్లి: మండలంలోని అంబటివలస జంక్షన్ నుంచి రోళ్లవాక జంక్షన్ వరకు జాతీయ రహదారి-26పై ఎస్ఐ యు.మహేష్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది వేగనిరోధకాలను ఏర్పాటు చేశారు. ఈరెండు జంక్షన్‌ల మధ్యలో తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తుండడంతో ఇటీవల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసులతో కలిసి రహదారిని పరిశీలించారు. ఎస్పీ సూచనలు మేరకు జాతీయ రహదారిలో స్టాపర్లను ఏర్పాటు చేశామని ఎస్ఐ చెప్పారు. ఎంపీటీసీ తాళ్ల పూడి అప్పలనాయుడు, ఉప సర్పంచ్ ఆర్.రాము పాల్గొన్నారు.

సారాతో జీవితాలు నాశనం



సారా, మద్యం, ఇతర మత్తు పదార్థాలకు బానిసలుగా మారి జీవితాలు నాశనం చేసుకోవద్దని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సీఐ జి.ఎస్.రాజశేఖర్ నాయుడు ప్రజలకు హితువు పలికారు. నవోదయం కార్యక్రమంలో భాగంగా కొత్తవలస మండలంలోని అప్పన్నదొరపాలెం గ్రామ పంచాయ తీ శివారు జోడిమెరక గ్రామంలో ప్రజలకు శనివారం అవగాహన కల్పించారు. సారా తయారు చేసినా, విక్రయించినా, బెల్టు షాపులు నిర్వహించినా కేసులు తప్పవన్నారు. అంతా సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఎక్సైజ్ సిబ్బంది టి.వీర్రాజు, బి.రాయుడు, బి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. – కొత్తవలస

బాలభవన్‌లో పోటీలు



బాలల దినోత్సవం సందర్భంగా పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు రెండు రోజులుగా చీపురుపల్లి పట్టణంలోని జవహర్ బాలభవన్ కేంద్రంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న పోటీలకు విశేష స్పందన లభిస్తోంది. శనివారం సంగీతం, చిత్రలేఖనం విభాగాల్లో నిర్వహించిన పోటీ లకు దాదాపు వంద మంది విద్యార్థులు హాజరయ్యారు.ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బాలల దినోత్సవం రోజున బహుమ తులు అందజేయనున్నారు. – చీపురుపల్లి

జంగిల్ క్లియరెన్స్ చేయరూ..



బానాది గ్రామం నుంచి వేపాడ మండల కేంద్రానికి వచ్చే రోడ్డులో మైచర్ల శింగవరం వద్ద రోడ్డుకు ఇరువైపులా తుప్పలు, పిచ్చిమొక్కలు విపరీతంగా పెరిగిపోయాయి. వీటి వల్ల ఎదురుగా వచ్చే వాహనాలకు దారి ఇవ్వడం ఒక సమస్య అయితే, మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వచ్చే వాహనాన్ని గుర్తించలేక పోవడం మరో సమస్యగా మారింది. సంబంధిత అకారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. – వేపాడ

ఓటర్ల నమోదును సమర్థవంతంగా నిర్వహించాలి


చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఆర్డీఓ సుధారాణి

చీపురుపల్లి: ఓటర్ల నమోదు ప్రక్రియను బీఎల్ఓలు సమర్థవంతంగా నిర్వహించాలని ఇన్‌చార్జి ఆర్డీఓ, ఎస్సీ సొసైటీ ఈడీ ఎం.సుధారాణి అన్నారు. పట్టణంలోని 145, 146 నంబర్ పోలింగ్ బూత్‌లలో ఓటరు నమోదు, జాబితాలో మార్పులు, చేర్పుల కోసం శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమా న్ని ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని, జాబితాలో తప్పులను సవరించా లని సిబ్బందికి సూచించారు. ఆదివారం కూడా ఈ కార్యక్రమం కొనసాగుతుందని, అలాగే ఈ నెల 23, 24వ తేదీల్లో కూడా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.హర్షవర్ధిని తదితరులు పాల్గొన్నారు.


లక్కవరపుకోట: ఎల్.కోట హైస్కూల్‌లో బీఎల్ఓలకు సూచనలు చేస్తున్న రిటర్నింగ్ అధికారి మురళీకృష్ణ

తప్పులు లేని ఓటర్ల జాబితానే లక్ష్యం

లక్కవరపుకోట: తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీనే లక్ష్యంగా బీఎల్ఓలు పని చేయాలని ఎస్.కోట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.మురళీకృష్ణ సూచించారు. స్థానిక హైస్కూల్‌లోని పోలింగ్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన ఓటర్ల ప్రత్యేక పునరశ్చరణ కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ఆదివారం కూడా బీఎల్ఓలు తమ కేటాయించిన పోలింగ్ స్టేషన్‌లలో ఈ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ టి.రమేష్, ఎన్నికల డీటీ సునీత ఉన్నారు.

హైందవ శంఖారావం సభకు తరలిరండి

గజపతినగరం: విజయవాడలో 2025 జనవరి 5న నిర్వహించనున్న హైందవ శంఖారావం బహిరంగ సభకు హైందవులంతా తరలిరావాలని విశ్వహిందూ పరిష త్ ప్రాంతధర్మ ప్రసార సంయోజిక్ పొగిరి సూర్యనారాయణ కోరారు. మండలంలోని మరుపల్లి బాలాజీ పాలిటెక్నికల్ విద్యాసంస్థలో హైందవ శంఖారావం సన్నాహక బహిరంగ సభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ దేవాలయాల సంరక్షణ, స్వయం ప్రతిపత్తి కోసం, దేవాల యాలను ప్రభుత్వ ఆధీనం నుంచి తప్పించి ఆలయ కమిటీలను ఏర్పాటు చేసి వాటికి బాధ్యతలు అప్పగించాలని కోరుతూ సుమారు అయిదు లక్షల మందితో హైందవ శంఖారావం బహిరంగ సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి పావని, సమరసత సేవా ఫౌండేషన్ సంయోజకులు రాగల బలరామ్‌నాయుడు, స్థానిక అసెంబ్లీ కన్వీనర్ సరిది దుర్గారావు, సహకార్యదర్శి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.


శంఖారావం సభ ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న విశ్వహిందూ పరిషత్ ధర్మ ప్రచారకులు

మద్యంతో పట్టుబడిన వ్యక్తిపై కేసు

శృంగవరపుకోట: మండలంలోని పోతనాపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సింహాద్రి తెలిపారు. పోతనాపల్లిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడులు చేశామని, పైల సత్యనారాయణ అనే వ్యక్తిని 11 మద్యం సీసాలతో పట్టుకున్నామని, మద్యం బాటిళ్లను సీజ్ చేసి కేసు నమోదు చేశామని చెప్పారు. దాడుల్లో సిబ్బంది హెచ్ రాంబాబు, ఈసీలు ప్రసాద్, ప్రదీప్ పాల్గొన్నారు.